క్లుప్తంగా

మాజీ కౌన్సిలర్ పుణ్యవతి మృతి

అమలాపురం టౌన్: పట్టణంలోని కల్వకొలను వీధికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కల్వకొలను పుణ్యవతి(90) గురువారం తెల్లవారుజామున తన స్వగృహంలో మృతి చెందారు. 2005–2010 మధ్య కాలంలో ఆమె కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆమె మృతిపై పట్టణానికి చెందిన పలు పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల దోహదం


తాళ్లరేవు ఎంపీపీ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ సునీత తదితరులు

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి టేకుమూడి వేణుగోపాల్, రాయుడు గంగాధర్, నడింపల్లి వినోద్, గంజా సూరిబాబు, వాడ్రేవు వీరబాబు, వాకపల్లి చిరంజీవి, వాసంశెట్టి శ్రీనివాస్, సూరంపూడి కుమార్, పినపోతు అరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ స్టేడియం ఇన్‌చార్జిగా ప్రకాష్


ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరించిన వైఎస్సార్ స్టేడియం ఇన్‌చార్జి ప్రకాష్

యానాం: యానాం పట్టణంలో డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం అండ్ స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జిగా స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా పీవీఎస్ ప్రకాష్‌ను నియమిస్తూ పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ ఎఫైర్స్ మెంబర్ సెక్రటరీ పి.ప్రియదర్శిని గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా ఉన్న సుబ్బన్న రిటైర్ అవడంతో ఆయన స్థానంలో ఈ నియామకం చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను స్టేడియం ఇన్‌చార్జిగా నియమితులైన ప్రకాష్ మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి సత్కరించారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదు

అల్లవరం: గోదావరి నదికి వరద పెరుగుతున్న నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని తహసీల్దార్ నరసింహరావు సూచించారు. బోడసకుర్రు పల్లిపాలెంలోని పుష్కరఘాట్‌లో వరద పరిస్థితిని ఎంపీడీఓ కృష్ణమోహన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వరద పెరిగితే పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని సూచించారు.

వ్యాధులు ముసురుతున్నా అరకొర నిల్వలే..

- పట్టణంలో పంజా విసురుతున్న సీజనల్ వ్యాధులు
- దోమల వ్యాప్తిని నిరోధించేందుకు అవసరమైన సామగ్రికి కొరత
- ఎంఎల్ ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్, ముగ్గు నిల్వలు అంతంత మాత్రమే


అమలాపురం మున్సిపల్ కార్యాలయ భవనం

అమలాపురం టౌన్: పట్టణంలో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా తదితర సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా రోజురోజుకీ జ్వరాల తీవ్రత పెరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ జ్వర బాధితులు ఎక్కువగా కనిపిస్తున్నారు. అయితే దోమల వ్యాప్తిని నిరోధించేందుకు, పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు అవసరమైన ఎంఎల్ ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్, ముగ్గు తదితర నిల్వలు మున్సిపాలిటీ వద్ద తగినంత లేకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాల్సి ఉన్నా ఈ ఏడాది అరకొర నిల్వలతోనే సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు మున్సిపాలిటీ ప్రయత్నిస్తుండడం కౌన్సిల్ సభ్యులనే ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

చేతులు కాలాక ఆకులు పట్టుకుంటారా?

వర్షాకాలం రావడానికి ముందే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ఎంఎల్ ఆయిల్ బాల్స్, బ్లీచింగ్, ముగ్గు తదితర సామగ్రిని మున్సిపాలిటీ పారిశుద్ధ్య శాఖ సిద్ధం చేసుకోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు, నూతిలో చేద పడ్డాక తీరిగ్గా తాడు పేనుతున్నట్లు ఉంది మున్సిపాలిటీ తీరు. ఓ పక్క పట్టణంలో సీజనల్ వ్యాధుల తీవ్రత అధికంగా ఉన్న ఈ కీలక సమయంలో మున్సిపల్ అధికారులు ఇప్పుడు తీరిగ్గా కౌన్సిల్ అజెండాలో ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్, ముగ్గు కొనుగోలుకు ఆమోదం కోరడం విడ్డూరంగా ఉంది. పది రోజుల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశపు అజెండాలో అయిదో అంశంగా రూ.5 లక్షలతో బ్లీచింగ్, ముగ్గు, ఆయిల్ బాల్స్ కొనుగోలుకు కౌన్సిల్ ఆమోదాన్ని కోరారు. పైగా ఈ కొనుగోళ్లకు సంబంధించిన టెండర్లలో నలుగురు కాంట్రాక్టర్లు పాల్గొనగా ఓ కాంట్రాక్టరు 15.03 శాతం లెస్ టెండర్లు వేశారు. ఇంత లెస్ టెండర్‌కు తోడు జీఎస్టీ కూడా తోడై ఆ కాంట్రాక్టర్ మున్సిపాలిటీకి బ్లీచింగ్, ముగ్గు ఎలా సమకూర్చుతారన్న సందేహంతో కౌన్సిల్ ఆ అంశాన్ని రద్దు చేసింది. దీంతో బ్లీచింగ్, ముగ్గు కొనుగోళ్లపై మరింత జాప్యం అనివార్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

మరీ ఇంత నిర్లక్ష్యమా?

పట్టణంలో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతున్నా కేవలం నిల్వలు లేని కారణంగా మున్సిపాలిటీ కాలనీల్లో బ్లీచింగ్ చల్లించే సాహసం చేయడం లేదు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే తమ తప్పును కప్పి పుచ్చుకోవడానికి సరిపడా నిల్వలు ఉన్నాయంటూ సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి పట్టణంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులను పూర్తిస్థాయిలో ఎదుర్కొనేందుకు సరిపడా ఎంఎల్ ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ నిల్వలు మున్సిపాలిటీ వద్ద లేవని కొందరు పాలక, ప్రతిపక్షాలకు చెందిన కౌన్సిలర్లు సైతం ఏకరవు పెడుతున్నారు. ఇలాంటి కీలక సమయంలో మున్సిపల్ కమిషనర్ బదిలీపై వెళ్లడం, కొత్త కమిషనర్ ఇంకా బాధ్యతలు స్వీకరించకపోవడం, ముఖ్యంగా పట్టణ పారిశుద్ధ్య విభాగానికి శానిటేషన్ సూపర్‌వైజర్ పోస్టు కూడా ఖాళీగా ఉండడం వంటి ప్రతికూల పరిస్థితులు మరింత జాప్యానికి దారి తీస్తున్నాయి.

ప్రస్తుతానికి సరిపోతాయి

మున్సిపాలిటీలో బ్లీచింగ్, ముగ్గు నిల్వలు ప్రస్తుతానికి సరిపోతాయి. అయినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిల్వలను మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. కౌన్సిల్ ఆమోదంతో బ్లీచింగ్, ముగ్గు, ఆయిల్ బాల్స్ కొనుగోళ్లకు త్వరలోనే చర్యలు చేపడతాం.

– సీహెచ్ నాగ సతీష్, డీఈఈ, అమలాపురం మున్సిపాలిటీ

రామునికి సమర్పించే విల్లు, బాణం ప్రదర్శన


అయోధ్య కోదండ రామునికి సమర్పించే విల్లు, బాణం

అమలాపురం టౌన్: అయోధ్యలో కోదండ రామునికి సమర్పించేందుకు హైదరాబాద్ వాసి చల్లా శ్రీనివాసశాస్త్రి వెండి, బంగారంతో తయారు చేయించిన విల్లు, బాణాలను స్థానిక భూపయ్య అగ్రహారంలో భక్తుల వీక్షణం నిమిత్తం గురువారం సాయంత్రం ప్రదర్శించారు. వీటిని అనేక మంది భక్తులు సందర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాసశాస్త్రి విలేకర్లతో మాట్లాడుతూ ఈ విల్లు, బాణాన్ని చెన్నైలో తయారు చేయించినట్లు చెప్పారు. వీటిని 13 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో చేయించానన్నారు. ముందుగా కంచి పీఠాధిపతితో విల్లు, బాణానికి పూజలు చేయించామన్నారు. అయోధ్యలో నిర్మాణంలో ఉన్న కోదండ రాముని ఆలయంలో విల్లు, బాణాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రజల సందర్శన కోసం ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో వీటిని శ్రీలంకలో కూడా ప్రదర్శిస్తామన్నారు.

కాపుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా


పి.మల్లవరంలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

తాళ్లరేవు: కాపుల హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మండల పరిధిలోని పి.మల్లవరం గ్రామంలో ఏర్పాటుచేసిన కాపు హక్కుల పరిరక్షణ సమితి ముమ్మిడివరం నియోజకవర్గ కార్యాలయాన్ని అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కోటిపల్లి వీవీఎస్ఎస్ ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాపు సామాజికవర్గంలో పేదల అభ్యున్నతికి ఇటువంటి సంఘాలు దోహదం చేస్తాయన్నారు. సమితి అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాపు యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, నాగేంద్రప్రసాద్, గొల్లబాబు, విల్ల సత్యనారాయణ, అందే కాశీరాజు, నిమ్మకాయల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బోడసకర్రులో రైల్వే లైన్ అలైన్‌మెంట్ సర్వే


రైల్వే లైన్ కోసం సర్వే చేస్తున్న అధికారులు

అల్లవరం: కోటిపల్లి–నరసాపురం రైల్వేలైన్ కోసం నిర్మించనున్న రైల్వే లైన్ అలైన్‌మెంట్ నిమిత్తం మండలంలోని బోడసకుర్రు పంచాయతీ పరిధిలో గురువారం సర్వే నిర్వహించారు. మండల సర్వేయర్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో సర్వే బృందం బోడసకుర్రు పాలెం, పొట్టుపోతువారిమెరక, పాత సచివాలయం ప్రాంతాల్లో సర్వే చేశారు. ఈ ప్రాంతాల్లో 35 సర్వే నెంబర్లు గుర్తించారు. ఈ సర్వే నెంబర్లలో వ్యవసాయ భూమి, వ్యవసాయేతర భూమి, ఆక్వా, ఇళ్లు ఏమేమి ఉన్నాయో భౌతికంగా గుర్తించి యజమానుల వివరాలు, విస్తీర్ణం, అభ్యంతరాలను నమోదు చేశారు. రెండు రోజుల పాటు బోడసకుర్రు పరిసర ప్రాంతాల్లో సర్వే నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు. రైల్వే లైన్ సర్వేని తహసీల్దార్ నరసింహరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, వీఆర్‌ఓలు జి.సత్యనారాయణ, ఉల్లీస్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ


మట్టి వినాయక ప్రతిమలను పంచిపెడుతున్న లయన్స్ వశిష్ట క్లబ్ మహిళా ప్రతినిధులు

అమలాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా అమలాపురం లయన్స్ క్లబ్, లయన్స్ వశిష్ట క్లబ్‌ల ప్రతినిధులు స్థానిక సుబ్బారాయుడి చెరువు సెంటరులో ప్రజలకు వినాయక మట్టి ప్రతిమలను గురువారం సాయంత్రం పంపిణీ చేశారు. వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయ ప్రతిమతో పూజలు చేసి కాలుష్యాన్ని నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ జీవీఎస్ మల్లిబాబు, లయన్స్ వశిష్ట క్లబ్ అధ్యక్షురాలు కె.ఉషాబాల, కార్యదర్శి చిక్కాల అరుణ, కోశాధికారి డి.పద్మ, పంపన పద్మలత, కె.ఉమాదేవి, తటవర్తి లక్ష్మి, శిష్ట లక్ష్మి తదితరులు వినాయక ప్రతిమలను ప్రజలకు పంచిపెట్టారు.

ఎస్టీ కులాల సంక్షేమం కోసం కృషి


గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జునరావు

అమలాపురం రూరల్: ఎస్టీ కులాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎంపీడీవో జి.మల్లిఖార్జునరావు పేర్కొన్నారు. గురువారం కామనగరువు పంచాయతీ వద్ద జరిగిన ఎస్టీ కులాల గ్రామ సభకు సర్పంచ్ నక్కా అరుణ కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లిఖార్జునరావు మాట్లాడుతూ గిరిజనుల జీవితాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం 11 కీలకమైన మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిందన్నారు. సర్పంచ్ అరుణ కుమారి మాట్లాడుతూ ఎస్సీ కుటుంబాలకు పక్కా ఇళ్లు, ఇంటింటికీ తాగునీరు, విద్యుత్, విద్య, ఆరోగ్యం తదితర సౌకర్యాలను కల్పించడమే కాకుండా ఉచిత రేషన్, వంట గ్యాస్, ఆయుష్మాన్ భారత్, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం వంటి సదుపాయాలు సమకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్‌ఎస్ఎస్ సూరపరాజు, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం


ముంపునీటిలో ఉన్న ప్రతాప్‌నగర్ వాటర్ ట్యాంకు

కుళాయిల ద్వారా మురుగునీటి సరఫరా

తాళ్లరేవు: భారీ వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాలన్నీ జలమయమై ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు కాలనీలు ముంపునీటిలో ఉన్నాయి. కోరంగి పంచాయతీ పరిధిలోని ప్రతాప్‌నగర్ గ్రామంలో మోకాల్లోతులో వర్షం నీరు నిలిచిపోయింది. నీరు పోయే మార్గం లేకపోవడంతో స్థానికులు మురుగు నీటిలోనే సంచరించాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు గురువారం తాగునీటి కుళాయిల నుంచి మురుగునీరు సరఫరా అయ్యిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అసలే ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అనేక మంది జ్వరాల బారిన పడి అల్లాడుతున్నారని, ఇటువంటి కలుషిత నీటిని తాగితే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. తాగునీటి ట్యాంకు ముంపునీటిలో ఉండడం, తాగునీటి పైప్‌లైన్ వాల్వు సైతం ముంపుబారిన పడడంతో కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా అవుతుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రతాప్‌నగర్ ప్రాంతంలో ముంపునీటిని తొలగించాలని, అలాగే కుళాయిల నుంచి సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వేలైన్ పాత రూట్ మ్యాప్‌లోనే నిర్మించాలి

అమలాపురం రూరల్: కోనసీమ రైల్వే లైన్‌ను పాత రూట్ మ్యాప్ ఆధారంగానే నిర్మించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ నిశాంతికి అమలాపురం మండలం, భట్నవెల్లి, చిందాడగరువు, రోళ్లపాలెం, కామనగరువు, ఇమిడివరప్పాడు, పేరూరు, అల్లవరం మండలం బోడసకుర్రు ప్రాంతాలకు చెందిన రైతులు గురువారం కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. కొత్త రైల్వే లైన్ రూట్ మ్యాప్ ద్వారా ప్రభుత్వానికి అధికంగా ఖర్చవుతుందని, పైగా తాము విలువైన భూములను కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే హైవే పేరిట భూములను అప్పగించామని, మళ్లీ రైల్వే లైన్ కోసం భూములను ఇచ్చేందుకు సిద్ధంగా లేమని జేసీకి తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోనకల గణేష్, రైతులు రంకిరెడ్డి సూర్యనారాయణ, మట్టా రామారావు, రాజులపూడి భీముడు, అరవ పూర్ణచంద్రరావు, రాజులపూడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీని వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించి సంతాపం తెలిపారు. అలాగే మృతి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కల్వకొలను పుణ్యవతికి సంతాపం తెలిపారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, దొమ్మేటి రాము, కముజు రమణ, గోపి రమేష్, దొంగ చిన్నా, కల్వకొలను బాబి పరామర్శించిన వారిలో ఉన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ


బండారులంక అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న సీడీపీవో విజయకుమారి

అమలాపురం రూరల్: సంపూర్ణ పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చునని అమలాపురం సీడీపీవో విజయకుమారి పేర్కొన్నారు. అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో బండారులంక, ఈదరపల్లి ఆర్‌ఆర్‌నగర్‌లో గురువారం జరిగిన మాసోత్సవాల్లో సీడీపీవో మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. రక్తహీనత వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గోదావరి వరద ఉధృతిపై ఎమ్మెల్యే సమీక్ష

యానాం: గౌతమి గోదావరికి వరదనీరు పోటెత్తుతుండటంతో తీర గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ అధికారులంతా అందుబాటులో ఉండాలని, టైడల్ లాకు వద్ద గల కల్వర్టు నుంచి మోటార్ల సహాయంతో వరద నీటిను మళ్లించాలని సూచించారు. అంతకు ముందు ఆయన పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. సమావేశంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజు, జ్యోతిరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీలకు బదిలీలు

యానాం: నియోజకవర్గ పరిధిలో పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీలను బదిలీ చేస్తూ డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ వెర్బినా జయరాజ్ గురువారం ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి టీకేఆర్ఎస్‌పీ పాఠశాలలో పనిచేస్తున్న ఇందుగుల వెంకట కృష్ణమోహన్‌ను యానాం ఎంజీజీబీహెచ్ ప్రభుత్వ హైస్కూల్‌కు, అంబేడ్కర్ బాలికల ప్రభుత్వ హైస్కూల్ పీఈటీ వినోద్‌ను పిల్లయార్‌కుప్పంకు బదిలీ చేశారు.

15న ఎల్జీ కైలాష్‌నాథన్ రాక

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఐఏఎస్ అధికారి కె.కైలాష్‌నాథన్ ఈ నెల 15, 16 తేదీల్లో యానాం నియోజకవర్గంలో పర్యటించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తుంది. ఇప్పటికే ఆయన కారైకల్, పుదుచ్చేరి, మాహేలలో విస్తృతంగా పర్యటించారు. యానాంలో పర్యటన నిమిత్తం అధికారిక సమాచారం రావాల్సి ఉందని స్థానిక ఆర్ఏఓ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఎల్జీ పర్యటన నేపథ్యంలో అధికారులంతా శాఖల వారీగా సమాచారమంతా దగ్గర ఉంచుకోవాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు.

ఆదివాసీలకు మౌలిక సౌకర్యాల కల్పన


పీఎం జన్‌మన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: పీఎం జనమన్ కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ తెగల కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పక్కా గృహాలు, రోడ్లు నిర్మాణం, పిల్లలకు విద్యా సౌకర్యం తదితర కనీస మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. బెండమూర్లంక సచివాలయంలో సర్పంచ్ బర్రే సీతారత్నం అధ్యక్షతన జనజాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, తహసీల్దార్ నరసింహరావు, ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఏఈలు సంపన్, స్వామి, డి.శ్రీనివాస్, ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి కుడుపూడి మహేష్, ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ, కార్యదర్శి చిక్కం శ్రీను, యాళ్ల కాసుబాబు, పినిశెట్టి శ్యామలరావు, గుత్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

తాళ్లరేవు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు జి.విజయకుమారి, సయ్యద్ ఫయాజ్‌లతో పాటు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు సయ్యద్ వహిద్దీన్, పి.నూకరత్నం, పి.లక్ష్మీరాధ, వై.నాగేశ్వరరావు, సీవీవీ సత్యనారాయణలను ఎంపీపీ రాయుడు సునీత దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. స్థానిక లయన్స్‌క్లబ్ హాలులో జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులు చింతా నారాయణమూర్తిరాజు, కొమ్మోజు రంగబాబు, మోకా ఉమ, గెడ్డం రాజ్యలక్ష్మి, సయ్యద్ వహేదున్ తదితరులను సత్కరించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంఈఓలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పేరూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ యార్లగడ్డ సంజీవయ్య జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన గురుపూజోత్సవంలో కలెక్టర్ మహేష్ కుమార్, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మిల చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని స్వీకరించారు. పేరూరుపేట మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం నయనాల రాజరాజేశ్వరిని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీహరి, డీవైఈవో సూర్యప్రకాష్ సత్కరించారు.

అల్లవరం: మొగళ్లమూరు యూపీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు చిట్టాల రాజరాజేశ్వరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయు అవార్డుని కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా గురువారం అవార్డుని అందుకున్నారు. ఆమెను ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు అభినందించారు.

యానాం: యానాం ఇందిరాగాంధీ ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్‌పీఎస్ఎన్ ఆచార్యులు రీజినల్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం రంగసామి చేతుల మీదుగా అందుకున్నారు. పుదుచ్చేరిలో జరిగిన టీచర్స్‌డే వేడుకల్లో భాగంగా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హోంమంత్రి నమశ్శివాయం, రాజ్యసభ సభ్యుడు సెల్వ గణపతి, విద్యాశాఖ డైరెక్టర్ ప్రియదర్శిని పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు లభించింది. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో హెచ్ఎం ఘన సత్యనారాయణ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈవో కమలకుమారి, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

యానాం: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహిస్తారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో జరిగిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యానాం పాఠశాలల్లో మరిన్ని మౌలిక సౌకర్యాల కల్పనకు స్మార్ట్ స్కూల్స్‌గా మార్చేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతకముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, హంసాని రామలక్ష్మణుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.